# నిన్ను నీవు తెలుసుకో

– కాకాని కమల

''ప్రియమైన శారదా!

నీకు ఉత్తరం రాయక రెండు నెలలు అవుతోందికదూ! నీవు రాసిన రెండు ఉత్తరాలు అందాయి. నీకు జవాబు రాద్దాం అనుకుంటూనే అశ్రద్ధ చేశాను. కానీ ఇప్పుడు నీకు రాసే ఉత్తరంలో ఒక గొప్ప విశేషం ఉంది.

రెండు సంవత్సరాల క్రితం మనం డిగ్రీ కాలేజీలో వున్నప్పుడు మన క్లాస్‌మేట్ ప్రియంవద నీకు జ్ఞాపకం వుందా? వాళ్ల నాన్నగారు ఇంజనీర్. వాళ్లు బాగా ఆస్తిపరులు. ప్రియంవద ఒక్కత్తే కూతురు. రోజూ కార్లో వచ్చేది. మనం ఇద్దరం హాస్టల్‌లో వుండేవాళ్లం. ఈపాటికి నీకు జ్ఞాపకం వచ్చే వుంటుంది. ఆ ప్రియంవద నాకు ఆమధ్య షాపింగ్ కాంప్లెక్స్‌లో కనిపించింది. పిజి చేసిందిట. వాళ్ల నాన్నగారు ఏదో ప్రైవేట్ ఫర్మ్ ప్రియ పేరు మీద పెడుతున్నారట. ఆ పన్లు చూసుకుంటున్నానని చెప్పింది. ఆ ఫర్మ్ ఎమ్‌డి ప్రియంవదేనట. విజయవాడలో కలసి చదువుకున్నాం. ఆ తరువాత ప్రియ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆమెతో మనకి కాంటాక్ట్ లేకుండా అయింది. ఇప్పుడు ప్రియ నాన్నగారు వాళ్లు ఈ విశాఖపట్నంలోనే ఉంటున్నారు. నాకు పెళ్లయింది. మావారి ఉద్యోగరీత్యా ఇక్కడ ఉంటున్నాం అని తెలిసి చాలా సంతోషించింది. మా ఇంటికి కూడా వచ్చింది. మీ గురించి చెప్పాను. నీకు ఇంకా పెళ్లి కాలేదని, గవర్నమెంట్ జాబ్ చేస్తూ హైద్రాబాద్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో ఉంటున్నావని చెప్పాను. నీ అడ్రస్ తీసుకుంది. ఎందుకో తెలుసా? తొందరలో ప్రియంవద పెళ్లి. వాళ్లు ప్రైవేట్ ఫర్మ్ పెడుతున్నారుకదా. ఆ పన్ల గురించి తరచూ వాళ్ల నాన్నగారు హైదరాబాద్ వస్తారుట. అప్పుడప్పుడు ప్రియ కూడా అక్కడికి వాళ్ల నాన్నతో వస్తూ వుంటుందిట. ఈసారి వచ్చినప్పుడు నిన్ను పర్సనల్‌గా కలసి నీకు పెళ్లి శుభలేఖ స్వయంగా ఇస్తానంది. ఈలోగా ఉత్తరం కూడా రాస్తుందేమో. ఇంతకీ అసలు నీకు అర్జంటుగా చెప్పాలనుకున్న విషయం రాయలేదు కదూ. ప్రియంవద పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరో తెలుసా? ఎవరో ఊరూ పేరూలేనివాడు అయితే నేనసలు నీకా ఉత్తరం వ్రాసి వుండేదాన్ని కాదు. ప్రియంవద పీకలమీద లవ్వులో పడిందే. ఆ లవ్వులో కూడా అది చాలా అడ్వెంచర్ చేసింది. రెండు సంవత్సరాలు ఉత్తరాల ప్రేమాయణం నడిపి ఇప్పుడు ఆ లవ్వర్‌నే పెళ్లి చేసుకుంటుంది. వారి అడ్వెంచర్ అని ఎందుకంటున్నానంటావా? ఆ వ్యక్తి సామాన్యుడు కాదు. మనందరికీ తెలిసిన ప్రబుద్ధుడు. ఇప్పుడు పత్రికల్లో నెంబర్‌వన్‌గా కీర్తి శిఖరాలు అందుకుంటున్న ప్రముఖ రచయిత శ్రీకర్. అతని పూర్తి శ్రీకరుణాకర్‌ట. కలం పేరు శ్రీకర్‌ట. నేటి ట్రెండ్‌లో నెంబర్‌వన్ రచయిత. ఎందరో పాఠకులకి ఆరాధ్య అభిమాన రచయిత. మూడు పదులు దాటుతున్న ఆ రచయిత పెళ్లి వద్దు అనుకున్నాడట. కానీ ఈ మన ప్రియంవద ప్రేమలో పడ్డాక పెళ్లికి సిద్ధపడ్డాడు.

నిజంగా అది మన ప్రియంవద క్రెడిట్ కదూ. మన కాలేజీలో రోజుల్లో కూడా ప్రియ స్పెషల్ అట్రాక్షన్‌గా వుండేది. ఖరీదైన బట్టల్లో ఏడువారాల ఫ్యాషన్ నగలతో కారులో వచ్చేది. ఒక్కర్తే గారాలపట్టి. దానికేం కొదవ. డబ్బు దాని గ్లామరుని పెంచింది అనుకునేవాళ్లం. ఆనాటి దాని ప్రత్యేకత ఇప్పుడు దాని పెళ్లిలోనూ కనిపిస్తోంది.

రెండు సంవత్సరాలు ఉత్తరాల ద్వారా ప్రేమించుకుని ఆ తరువాత కలుసుకున్నారట. ఇప్పుడు పెళ్లి చేసుకోబోతున్నారు. బహుశా వచ్చే నెలాఖరికి దాని పెళ్లి జరగవచ్చు. ఇంక డేట్ నిర్ణయం కాలేదని చెప్పింది. అది ఒక ప్రముఖ రచయితని చేసుకోబోతోందంటే అప్పుడే ఇక్కడ మా అందరికీ ఒక సెన్సేషన్‌గా వుంది.

ప్రియంవద నీ అడ్రస్ తీసుకుంది. నీకు ఉత్తరం రాస్తానంది. హైదరాబాద్‌లో వాళ్ల చుట్టాలు చాలామంది ఉన్నారట. వాళ్లందరితోపాటు స్వయంగా నీక్కూడా పెళ్లి శుభలేఖ ఇస్తానంది. ఎంతో పేరు ఆదర్శభావాలుగల రచయితని అది పెళ్లి చేసుకోబోవడం చాలా థ్రిల్లింగ్‌గా వుంది కదూ. మనం అందరం దాని పెళ్లిలో కలుసుకుందాం. రచయితతో పెద్ద ఇంటర్‌వ్యూ చేద్దాం. మనం అందర్నీ కల్సుకుని పరిచయం చేసుకోవచ్చు. తీరిగ్గా నీకు ఇంకోసారి ఉత్తరం రాస్తా. ఇక వుంటా.

నీ ప్రియ మిత్రురాలు

అంబిక''

రెండు సంవత్సరాలు ఉత్తరాల ద్వారా ప్రేమించుకుని ఆ తరువాత కలుసుకున్నారట. ఇప్పుడు పెళ్లి చేసుకోబోతున్నారు. బహుశా వచ్చే నెలాఖరికి దాని పెళ్లి జరగవచ్చు. ఇంక డేట్ నిర్ణయం కాలేదని చెప్పింది. అది ఒక ప్రముఖ రచయితని చేసుకోబోతోందంటే అప్పుడే ఇక్కడ మా అందరికీ ఒక సెన్సేషన్‌గా వుంది.

★★★

''ప్రియమైన ప్రియంవదా!

నీ గురించి ఆదర్శభావాలుగల ప్రముఖ రచయిత శ్రీకర్‌తో నీ పెళ్లి గురించి అంబిక రాసింది. తొందరలోనే నీ పెళ్లి జరగబోతున్నందుకు నీకు నా అభినందనలు. ఆ రోజుల్లో నువ్వు చక్కగా పాటలు పాడేదానివి. మన కాలేజీ మాగ్‌జైన్స్‌కి చిన్న చిన్న కవితలు రాసేదానివి. నీ అభిరుచికి తగినట్టే సంగీత సాహిత్యం జత పడుతున్నందుకు ఆనందంగా వుంది. ఇంకేం? నీ భర్తగారు రచయిత కదా? ఆయన రచించిన కవితల్ని నువ్వు బాణీలు కట్టి పాడు. శ్రీకర్‌గారి రచనలు నేను ఎన్నో చదివాను. మీ పెళ్లి రోజు కోసం నీకంటే ఎక్కువగా నేనే ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే నిన్నూ రచయితగారినీ చూడాలన్న ఆత్రం. స్వయంగా వచ్చి శుభలేఖ ఇస్తేగానీ నీ పెళ్లికి రాను సుమా మరి. వీలు చూసుకుని ఉత్తరం రాయి. మీ నాన్నగారు పెట్టే ప్రైవేట్ ఫర్మ్‌కు నీవే ఎండి కాబోతున్నందుకు మరొకసారి అభినందనలు.

ఇట్లు

నీ ప్రియ మిత్రురాలు

శారద''

★★★

''ప్రియమైన శారదా!

నీ ఉత్తరం అందిన వెంటనే జవాబు రాద్దాం అనుకున్నాను కానీ మా ఫర్మ్ పని వత్తిడిలో పని రాయలేకపోయాను. ఎలాగూ ఆలస్యం అయ్యింది కదా ఏకంగా శుభలేఖతోటి మీ హైదరాబాద్‌కి వద్దాం అనుకున్నాను. కానీ అనుకోని ఒక యాధృచ్ఛిక సంఘటన జరిగింది. నా పెళ్లి ఆగిపోయింది. అందుకని నీకు 'ఉత్త'రమే రాస్తున్నాను.

నాకు శ్రీకర్‌తో రెండు సంవత్సరాలుగా పరిచయం వుంది. కానీ జీవితం తల్లకిందులు కావడానికి రెండు ఘడియలు చాలు అన్న గొప్ప జీవితసత్యం నాకిప్పుడే బోధపడింది. పదిరోజుల క్రితం ఓ దురదృష్టకర సంఘటన జరిగింది. ఒంగోలులో ఉండే మా పిన్ని కూతురు సరిత హఠాత్తుగా చనిపోయింది. అది డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. దాని మరణవార్త విని వెంటనే మేం అందరం కారులో వెళ్లాం. మా పిన్ని కూతురుది సహజ మరణం కాదు. బలవన్మరణం. అది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మా పిన్ని, బాబాయి పొలం పన్లో వుండి గ్రామం వెళ్లారుట. వాళ్లు లేకుండా చూసి ఇది ఈ పని చేసింది. ఇంతకీ విషయం

ఏమిటంటే అది ప్రేమలో మోసపోయింది. పెళ్లి కాకుండా గర్భం వచ్చింది. ఇంట్లో తెలిస్తే తిడతారని కొంత, దాని లవ్వర్ మనసు విరిగేలా అన్న మాటలకి కొంత దాని మనసు విరిగి ఆత్మహత్యా చేసుకుంది. దాని పెట్టెలో దాని లవ్వర్ రాసిన ప్రేమలేఖలు బోల్డన్ని దొరికాయి. అతను ఒంగోలులో వుండడు, బెంగుళూరులో వుంటాడట, కానీ ఉద్యోగరీత్యా తరచూ క్యాంప్స్‌కి ఊళ్లు తిరుగుతూ వుంటాడట. అతను రిప్రజెంటేటివ్. అలాగే ఒంగోలు క్యాంప్ వచ్చినప్పుడు సరిత అతనితో శారీరకంగా కూడా తొందర పడిందిట. తీరా పెళ్లి గురించి సరిత అడిగాక అతను కుదరదని చెప్పి దాని మనసు విరిగేలా మాట్లాడాడట. దాంతో తాళలేక సరిత ఆత్మహత్య చేసుకుంది.

ఇంతకీ దాని ప్రేమికుడు వేరే ఎవ్వరో కాదు. ప్రముఖ రచయిత శ్రీకర్. ఆశ్చర్యపోతున్నావుకదూ. ఆశ్చర్యమే మరి.

నాకు రాసినట్లే ప్రేమలేఖలు సరితకి రాసాడు. అయితే సరిత చిన్నపిల్ల కావడంతో అతని మాటలు నమ్మి కాలు జారింది. ఒక్క సరితకే కాదు. అతను అలా చాలామంది అమ్మాయిలకి అతను ఇలాగే ప్రేమలేఖలు రాసాడుట. క్యాంపుల పేరుతో ఆయా ఊళ్లో వెళ్లినప్పుడు వీళ్లని హోటల్ గదికి పిలిచి కల్సుకోమని ఆ తరువాత పడకదాకా పరిచయాలు పెంచేవాడట. పెళ్లి చేసుకుంటానని ప్రమాణాలు చేసేవాడట. వాళ్ల అందాల్ని పొగిడేవాడట. ఆ విధంగా ఆడపిల్లల్ని తన శారీరక సుఖం కోసం ఉపయోగించుకునేవాడట. మా పిన్ని కూతురు సరితకు రాసినట్టే ఇంకా కొంతమంది దీని కాలేజీలోని అమ్మాయిలకి కూడా ఉత్తరాలు రాసాడట. సరిత ఆత్మహత్యతో ఆ నోటా ఈ నోటా ఆ విషయాల్ని బయటకి వచ్చాయి. హోటల్ వారు కూడా చెప్తున్నారు. హోటల్ బోయ్‌లకి డబ్బులిచ్చి రహస్యంగా ఆడపిల్లల్ని గదిలో మానేజ్ చేసుకునేవాడ్టట. సరిత మరణంతో ఊరంతా మండినట్టు గగ్గోలు అయ్యింది. శ్రీకర్ అలాంటివాడంటే ముందే నాకు నమ్మశక్యం కాలేదు.

కానీ అతను రాసిన ఉత్తరాలు, ఆ లెటర్ పేపర్, దస్తూరి స్టయిల్ అన్నీ కళ్లతో చూశాక నమ్మకుండా ఎలా వుండను. అలాంటి ఉత్తరాలే నా పెట్టెనిండా ఉన్నాయి కదా. నాకెంత ఏడుపొచ్చిందో! సరితంటే చిన్నపిల్ల. పదిహేడేళ్లు. కానీ నేను? పిజి చేసి ఇవ్వాళో రేపో ఇండ్రస్టియలిస్ట్ కాబోతున్నాను. ఆ పిచ్చి మోహంలో నేనే పడ్డాను. అతని రచనల్లో కనిపించిన ఆదర్శాలకి అతను ప్రతీక అనుకున్నాను. కానీ ఆదర్శం అనేది మేడిపండు



అని నాకిప్పుడే తెలిసింది.

ఒక విధంగా స్త్రీలదే తప్పేమో? అవతలి వాడు మన తెలివిని, అందాన్ని పొగడగానే మనం పొంగిపోతాం. భ్రమలో పడిపోతాము. ఇలా ఇంకెంత మందిని పొగిడాడో అని ఆలోచించము. నిత్యం అద్దం మన అందాన్ని చెప్పదా? అయినా మీరీ చీరలో బాగున్నారు? అనగానే తొణికిపోతారు. ఆడవాళ్ల ఈ అమాయకత్వం, ఈ అవివేకమే ఇంకా ఆ తొందరపాటు పన్లు స్త్రీలు చేస్తున్నారు. దాన్ని తెలుసుకోలేకపోవడం మన తప్పే అనిపిస్తుంది. ఈ పాటి వివేకం నేర్పని విద్యలెందుకు? ఎవరో మనకి అన్యాయం చేసారు అనుకునేకంటే మనకి మనమే ద్రోహం చేసుకుంటున్నామనిపిస్తుంది. తొందరపాటులేని ఆడదాని వంటిమీద మగవాడు చెయ్యి వెయ్యగలడా? 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని' ఎదురుచూస్తూ వీరేశలింగం, రాజారామ్‌మోహన్‌రాయ్ వాళ్లు ఎందుకు పుట్టలేదు? అని వాపోయేకంటే మనమే ఆ పన్లకి కంకణం కట్టుకోవచ్చుకదా?

ఏదేదో రాస్తున్నానుకదూ. ఆవేశం... సరే ఇంక ఆ విషయం వదిలేద్దాం. వాళ్లతో ప్రేమ కలాపాలు నడిపి నన్ను పెళ్లి చేసుకుందుకు శ్రీకర్ ఇష్టపడడానికి కారణం నా అందం కాదు. నా వెనుక ఆస్తి అని అర్థం అయింది.

అందుకే నా పెళ్లిని నేనే క్యాన్సిల్ చేసుకున్నాను. మొగలిపూలకి పాముల పహారా, గులాబికి ముళ్లు కాపలా పెట్టిన భగవంతుడా స్త్రీ నిర్మల ప్రేమకి విలువ ఎందుకు కట్టలేదో?

నా పెళ్లి ఆగిపోయినందుకు నాకు ఎంతమాత్రం బాధగాలేదు. ఆ నయవంచకుడి అసలు రూపం ఇప్పటికైనా బయటపడినందుకు ఆనందంగా వుంది. సరిత లాంటి అమాయకురాలు మరణించినా ఎందరో సరితల కళ్లు తెరుచుకున్నాయి అనిపిస్తోంది. ముఖ్యంగా నన్ను నేను తెలుసుకున్నందుకు నీ అభినందనల కోసం ఎదురు చూస్తున్నాను.

ఇట్లు
నీ ప్రియ మిత్రురాలు
ప్రియంవద''